# అంతరంగ యాత్ర

# ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA AUG-NOV 2020 Rs. 2/- VOL. XV ISSUE 1

**జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ**

**పాఠక మిత్రులకు ప్రణామాలు. మునుపు కనీ వినీ ఎరగని మహా విపత్తు మానవ జాతిని అతలాకుతలం చేస్తున్నది. ప్రపంచమంతటా వ్యాపించి భయాందోళనలు సృష్టిస్తున్న ఈ అంటువ్యాధి కారణంగా సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. కృష్ణమూర్తి ఫౌండేషను నుండి ప్రచురిస్తున్న 'అంతరంగ యాత్ర' మీకు చేరడంలో జాప్యం జరుగుతున్నది. ఇందుకు విచారిస్తున్నాము. ఈ ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కృష్ణమూర్తి చెప్పిన కొన్ని అంశాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి 'ప్రపంచ సంక్షోభం' అనే శీర్షికతో మీకు అందజేస్తున్నాము.**

## సమస్త ప్రపంచం సంక్షోభంలో ఉన్నది

చరిత్రలోకి తొంగి చూశామంటే అక్కడ అన్నీ మనిషి తయారు చేసుకున్న విపత్తుల కథలే కనబడతాయి. ఈ ఉత్పాతాలు వరుసగా జరుగుతున్నట్లుగా కూడా కనబడుతుంది. మళ్ళీ మళ్ళీ ఏమాత్రం వరుస తప్పకుండా జరుగుతూనే వస్తున్నాయి. ప్రతిసారీ ప్రపంచం వాటిని చూసి విస్తుపోతునే ఉంటుంది. అవాక్కయి పోతునే ఉంటుంది. గొప్ప గొప్ప పండితులు, నిపుణులు, మేధావులు ఔన్నత్యం సాధించినవారు విశ్వసనీయంగా చెప్పే పలుకులను, ఇచ్చే హామీలను, అవీ ఇవీ గణించి కట్టిన సూత్రాలను, భవిష్యవాణులను లెక్కచేయకుండా విపత్తులు జరుగుతునే ఉన్నాయి. తర్కం, హేతువాదం, కారణవాదం మొదలైన వాటి నన్నింటినీ వమ్ము చేస్తూ వాటి పాటికి అవి జరుగుతునే ఉన్నాయి. మానవులు దిక్కుతోచని స్థితిలో, గందరగోళంలో, నిస్సహాయులై కొట్టుమిట్టాడుతునే ఉన్నారు. ఒక సంక్షోభానికీ మరో సంక్షోభానికీ మధ్య నున్న వ్యవధినే మనం సాధారణమైన సవ్యజీవితం అంటున్నాం. సవ్యమైన సాధారణ జీవన స్థితి అని మనం అంటున్న ఆ సమయంలో మన కాలాన్ని, మన శక్తిని ఎన్నింటికో వెచ్చిస్తాం తప్ప, అసలు మానవ జీవితానికి గల ఉద్దేశ్యం – ప్రయోజనం ఏమిటి? అనే అంశం గురించి గాని, అంతకంటే ముఖ్యంగా నా జీవిత ప్రయోజనం ఏమిటి అనే అంశం గురించి కాని లోతుగా ఆలోచించనే ఆలోచించం. మన వ్యక్తిగత నిత్యజీవనమే ఒకవేళ మహా విపత్తేమోనా అని కాని, ఇక ముందు రాబోయే ప్రపంచ సంక్షోభానికి ఇదే కారణభూతమా అని కానీ ఎన్నడూ ప్రశ్నించి చూసుకోము.



అసలు అటువంటి ప్రశ్నే మనకు ఎన్నడూ తట్టదు. ఒకవేళ తట్టినా దానిని పక్కకు తోసివేస్తాం. సూటిగా ఎదుర్కోము.

జె. కృష్ణమూర్తి మన పైకి సంధించిన సవాలు ఇదే. అనేకమైన మౌలిక ప్రశ్నలను అతి ప్రధానమైన ప్రశ్నలను మన ముందు పెట్టి వాటిని సూటిగా ఎదుర్కోమని చెప్తున్నారు. వాటిలో కొన్నింటిని ఇక్కడ పొందుపరచడం జరిగింది. సుమారు అయిదు దశాబ్దాల పాటు (1934 నుండి 1985 వరకు) సాగిన అతడి ప్రసంగాల నుండి, అతడు చేసిన రచనల నుండి ఇవి సేకరించబడ్డాయి.

# నిజమైన ప్రపంచ సంక్షోభం

## ఈ సంక్షోభం ఉన్నది మానవ చేతనలో

### జీవితంలో గల పవిత్రత నుండి మానవుడు దూరమై పోయాడు

ఈ ప్రస్తుత ప్రపంచ సంక్షోభం కనీవినీ ఎరగని ఒక మహా వైపరీత్యం. ఇప్పుడు ఉన్న ఈ సంక్షోభం మనిషి జీవితంలో సాధారణంగా తరచు వచ్చే విపత్తుల వంటిది కాదు. ఇది ప్రపంచ మంతటా విస్తరించి ఉన్న అల్లకల్లోల పరిస్థితి. ఇది ఒక్క ఇండియాకో యూరపుకో పరిమితమై లేదు. ప్రపంచంలోని మూల మూలలకూ వ్యాపితమై ఉన్నది. మానవ శరీరపరంగా చూసినా, మానసికపరంగా చూసినా, నీతిపరంగా కానీ ఆధ్యాత్మిక పరంగా కానీ చూసినా, ఆర్థికరంగంలో కానీ సామాజిక రంగంలో కానీ ఎక్కడ చూసినా గందరగోళము, అస్తవ్యస్తత, నిజాయితీ లేకపోవడము కనబడుతున్నాయి. కొండ శిఖరపు అంచుపై మనం నిలబడి ఉన్నాం. అంచుపై నిలబడి అతి అల్పమైన వ్యవహారాల గురించి కలహించుకుంటున్నాం. ఇప్పటి ఈ ప్రపంచ సంక్షోభంలో గల అపారమైన అపాయం గురించి, అతిక్లిష్టమైన పరిస్థితి గురించి ఎవ్వరూ గ్రహించినట్లు లేదు. ఇది ఎంత అసాధారమైనదో, ఎంత లోతైన ఆందోళనలకు గురి చేస్తుందో, ఎంతగా తల్లక్రిందులు చేయనున్నదో మనం గ్రహించడం లేదు. అపారమైన ఈ అస్తవ్యస్త స్థితిని గురించిన గ్రహింపు కల కొందరు తమ జీవన రీతులను, పద్ధతులను సవరించి మార్చుకోవడంలో మునిగి ఉన్నారు. వారిలో ఎంతో గందరగోళం ఉండటం వల్ల తమ పనులతో మరింత గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. తమ తమ వృత్తులకు అంకితమైపోయిన మేధావులు, బుద్ధిజీవులు, నిపుణులు ఈ ప్రపంచాన్ని ఏనాటికీ కాపాడలేరు. మానవుని జీవన ప్రక్రియలో, ఆ మొత్తంలో ఒక భాగం మాత్రమే అయిన మేధ పరాజయం చెందక తప్పదు. ఎందుకంటే మేధ ఇచ్చే పరిష్కారాలు, సమాధానాలు పాక్షికమైనవి. అందుచేత అవి సత్యం కాదు.



*(మద్రాసు, 22 అక్టోబరు 1947;*
*'ది కలెక్టెడ్ వర్క్స్ – 4వ సంపుటం')*

ఈ మహా విపత్తు ఏదో విధివశాన జరిగినది కాదు. మనలో ప్రతి ఒక్కరమూ దీనిని తయారు చేశాం. మన రోజువారీ కార్యకలాపాలైన ఈర్ష్య, ఉద్రేకాలతో, అత్యాశలతో, అధికారం కోసం, పెత్తనం కోసం అతిలాలస, పోటీలు పడటం, మనలో నిర్దాక్షిణ్యత పెరిగిపోవడం, ఇంద్రియ సంబంధిత విలువలు, కృతకమైన విలువలు వంటి వాటితో మనమే ఈ పెను విపత్తును తెచ్చిపెట్టుకున్నాం. ఈ పరమ దారుణమైన దైన్యస్థితికి, అస్తవ్యస్తతకు మనమే బాధ్యులం. వేరే ఎవరో బాధ్యులు కాదు. మీరూ నేనే. ఎందుకంటే ఆలోచనా లేమిలో, స్పృహలేని స్థితిలో ఉండి, మీమీ ఆకాంక్షల్లో నిండా మునిగిపోయి, ఇంద్రియ సంచలనం కలిగించే వ్యాపకాల్లో మునిగి తేలుతూ, తక్షణమే తృప్తినివ్వగల, తనివి తీర్చగల విలువలను పట్టుకొని వేలాడుతూ, మీరే ఈ విపరీతమైన, ప్రపంచాన్ని అంతటినీ ముంచెత్తుతున్న ఈ పెను విపత్తును తెచ్చిపెట్టుకున్నారు... ఈ ప్రళయానికి మీరే బాధ్యులు. ఏ ఒక్క ఫలానా సమూహమో బృందమో కాదు. ఏ ఒక్క వ్యక్తీ కాదు. బాధ్యులు మీరే.

*(మద్రాసు, 22 అక్టోబరు 1947;*
*'ది కలెక్టెడ్ వర్క్స్ – 4వ సంపుటం')*

సరే, ఆధునిక ప్రపంచం అంటే ఏమిటి? సాంకేతిక నైపుణ్యాలతో, కార్య సమర్థతతో నడిపించబడుతున్న పెద్ద పెద్ద సంస్థలతో నిర్మించబడినదేనా ఆధునిక ప్రపంచం అంటే? సాంకేతిక రంగంలో చూస్తే అద్భుతమైన ప్రగతి కనబడుతుంది. అధిక సంఖ్యాకుల వైపు ప్రజా బాహుళ్యం వైపు చూశామంటే వారిలో లేమి! ఆహార పదార్థాలు కాని, వస్తువులు కాని వారికి సమానంగా అందడం లేదు. ఉత్పత్తి సాధనాలు సమస్తమూ కొద్ది మంది చేజిక్కించుకొని తమ ఆధీనంలో ఉంచు కొన్నారు. జాతీయ భావాలు జాతుల మధ్య సంఘర్షణలకు కారకమయ్యాయి. యుద్ధాలు జరుగుతునే ఉన్నాయి. వాటికి అంతం ఉండటం లేదు. ఎందుకంటే ప్రభుత్వాలు సామ్రాజ్యాధి పత్యాలుగా స్థిరపడి పోయాయి. ఇదీ ఆధునిక ప్రపంచం అంటే. అంతే కదూ? సాంకేతిక పరమైన అభివృద్ధి జరిగింది కానీ దానికి సమమైన, అంతే శక్తివంతమైన మానసిక పరిణతి జరగలేదు. అందుచేత ఇప్పుడున్న ఈ స్థితిలో సమతుల్యత లేదు.

వైజ్ఞానిక రంగంలో కనీవినీ ఎరుగని

అద్భుతాలను సాధించారు. అదే సమయంలో మానవ జీవితంలో దారుణమైన దుస్థితి. డొల్లబారిన హృదయాలు, ఖాళీ మనసులు కనబడుతున్నాయి. ఇదీ ఈ ఆధునిక ప్రపంచపు తీరు. అంటే అది మీరే. ప్రపంచం వేరూ మీరు వేరూ కాదు. మీ ప్రపంచం అంటే అది మీరే. ఆ ప్రపంచంలో ఉన్నది పెంచి పోషించుకున్న మేధ, రిక్త హృదయాలు.

*(న్యూ ఢిల్లీ, 14 నవంబరు 1948;*
*'ది కలెక్టెడ్ వర్క్స్ – 5వ సంపుటం')*

---

పెను సంక్షోభం వచ్చి పడింది. ఈ సంక్షోభం ఉన్నది ప్రపంచంలో కాదు. ఈ సంక్షోభం అణుయుద్ధం కాదు. మహా భయంకరమైన విభేదాలు కాని విభజనలు కానీ కాదు. ఎక్కడ చూసినా ఎప్పుడూ అంతులేకుండా కొనసాగుతూ పోతున్న అమానుష హింసాకృత్యాలు కాదు. ఈ పెను సంక్షోభం మన చేతనలో ఉన్నది. మనం ఏమిటో అదే ఈ సంక్షోభం. మనం ఎలా తయారయ్యామో అదే ఈ పెను సంక్షోభం.

*('మైండ్ విథవుట్ మెషర్' నుండి; మద్రాసు, 25 డిసెంబర్ 1982)*

---

అనేక వేల సంవత్సరాలుగా జీవిస్తున్న ఈ మానవుడు ఎందుకని ఇటువంటి దారుణ దుర్దశలో, ఇటువంటి సంఘర్షణలో చిక్కుకొని పోయాడు?

… అధిక జనాభా కారణంగా అనో, నీతినియమాలు కోల్పోవడం వల్ల అనో వంటి తేలికైన వ్యాఖ్యానాలు, సమర్థించడాలు పక్కన పెట్టేయండి. సాంకేతిక విజ్ఞానం లేకపోవడం వల్ల, ప్రత్యక్షంగా భావప్రసారం జరిపే వెసులుబాటు లేకపోవడం వల్ల అవి జరిగాయి. సరే, అసలు ఈ పరమ దారుణ దుస్థితికి గల మూల కారణం ఏమిటి? ఈ బాధలకు వెనక గల అత్యంత ప్రధాన కారకం ఏది? ఈ దేశంలో, ఎక్కడయితే మంచితనం, దయాదాక్షిణ్యాలు ఉండాలి అనే, చంపకూడదు, అమానుషత్వం కూడదు అనే నియమాలు సంప్రదాయాలుగా స్థిరపడిపోయాయో అటువంటి ఈ దేశంలో వాటన్నింటిని పూర్తిగా కోల్పోయి ఇటువంటి స్థితి ఎందుకని దాపురించింది?

*(బొంబాయి, 28 జనవరి 1968;*
*'మీటింగ్ లైఫ్' నుండి)*

---

ఎందుకంటే, ప్రాచీన కాలంలో ఆకాంక్షపరత్వము, ఆధిపత్యం కొరకు లాలస లేని మనుష్యులు కొందరు ఉండేవారు. అటువంటి మనుష్యులతో కూడిన బృందాలు ఉండేవి. వారిలో అత్యాశలు కాని, దుర్మార్గ పూరితమైన ఊహలు, దుష్టచింతన కాని ఉండేవి కావు. సమాజంలో ఆధ్యాత్మికమైన, నీతిపరమైన క్షీణత వాటిల్లి, సమాజం



పతనమై పోకుండా వారు సమాజానికి మార్గనిర్దేశం చేయగలిగారు. అటువంటి వారితో కూడిన బృందాలు ఎంత ఎక్కువ సంఖ్యలో ఉంటే అంత ఎక్కువగా సమాజానికి, ప్రభుత్వానికి రక్షణ, భద్రత లభించేవి. ఈ కారణంగానే భారతదేశం లాగా ఒకటి రెండు దేశాలు మాత్రమే దుర్దశలో అంతమై పోకుండా నిలబడ గలిగాయి. లౌకిక ప్రపంచపు అల్లకల్లోలాలలో చిక్కుకొని పోకుండా ఉండ గలిగినవారు బొత్తిగా కొద్దిమందే అవడం వల్ల మీరు ఇటువంటి ఈ విపరీతమైన విపత్తులో పడిపోయారు.

*(మద్రాసు, 26 అక్టోబరు 1947;*
*'ది కలెక్టెడ్ వర్క్స్ – 4వ సంపుటం)*

---

వ్యాధుల వల్ల కలిగే దుఃఖం ఉన్నది. పూర్తిగా ఏకాకిగా అయిపోయానని భావించడం వల్ల మనిషికి కలిగే దుఃఖం ఉన్నది. పేదరికపు దుఃఖం ఉన్నది. దరిద్రులను, అజ్ఞానపు అంధకారంలో, దౌర్భాగ్యంలో మునిగి ఉన్నవారిని, దారి చూపించే ఏ ఆశాదీపమూ కానరాని దిక్కులేని దీనులను చూసినప్పుడు మనకు కలిగే దుఃఖం ఉన్నది. ప్రపంచంలో ఉన్న జంతువులనన్నింటినీ ప్రయోగశాలల్లో చంపుతూ, ముక్కలు ముక్కలుగా నరికి చిత్రవధలు చేస్తూ హతమారుస్తూ ఉంటే చూస్తున్నప్పుడు కలిగే దుఃఖం ఉన్నది.

*(బొంబాయి, 28 జనవరి 1978)*

---

ప్రకృతితో మనకు బొత్తిగా ఏ సంబంధమూ లేకపోవడం చూస్తుంటే చాలా వింతగా అనిపిస్తుంది. ఈ భూమిపై జీవిస్తున్న అసంఖ్యాకమైన ప్రాణుల ఎడల కనికారము, అనుస్పందన ఏమాత్రం మనకు ఉన్నట్లు కనబడటం లేదు. ఒక ప్రగాఢమైన, అచంచలమైన బాంధవ్యాన్ని కనుక మనం ప్రకృతితో నెలకొల్పుకుంటే మన జిహ్వాచాపల్యం కోసం ఒక్క జంతువును కూడా ఏనాటికీ చంపను గాక చంపము. మన స్వలాభం కోసం ఒక కోతికి గాని, కుక్కకు గాని, గినీ పందికి గాని హాని చేయనే చేయం. లాభాలు ఆర్జించడానికి వాటిని కోసి, పరిశీలించి చేసే పరీక్షలు చేయనే చేయం. మన దేహాల ఆరోగ్యం బాగు చేసుకోవడం కోసం, గాయాలు నయం చేసుకోవడానికి ఇతర మార్గాలు కనిపెడతాము. అయితే మనసును స్వస్థపరచడం అనేది పూర్తిగా భిన్నమైన విషయం. అది వేరు. మీరు కనుక ప్రకృతితో కలిసి జీవిస్తుంటే క్రమక్రమంగా ఆ స్వస్థతను పొందుతారు.

*(కృష్ణమూర్తి టు హిమ్‌సెల్ఫ్,*
*25 ఫిబ్రవరి 1983)*



ప్రకృతికి దూరంగా జరిగి మనం వెళ్ళిపోతుంటే ఒకరితో ఒకరం కూడా ఏ సంబంధమూ లేకుండా దూరమై పోతాం. పక్షులతోను, సంకోచంతో బెరుకు బెరుకుగా చూసే వల్లంకి పిట్టలతోను కూడా మనకు ఏ సంబంధాలూ ఉండవు. ఇక మీ పిల్లలతో, పాపలతో వీధిలో నడిచిపోతున్న మనుష్యులతో కూడా సంస్పర్శను, సంబంధాన్ని కోల్పోతారు. ఆహారం కోసం ఒక జంతువును మీరు చంపినప్పుడు మీలోని సున్నితత్వాన్ని కోల్పోతారు. మీలో నిర్దాక్షిణ్యతను పెంచుకుంటారు. మీలో సున్నితత్వం లేకపోవడమే సరిహద్దులకు ఆవలగా ఉన్న మనిషిని మీ చేత చంపిస్తుంది. అపారమైన జీవన ప్రవాహపు కదలికలతో సంస్పర్శను, సంబంధాన్ని పోగొట్టుకుంటే కనుక అప్పుడు మీరు అన్ని బాంధవ్యాలను, అన్ని సంబంధాలను తెగతెంపులు చేసుకున్నట్లే అవుతుంది. అప్పుడు మీరు – అంటే మీ అహం – అదే మహా ప్రధానమై పోతుంది. అదే తన చిత్ర విచిత్రమైన ప్రేరేపణలతో, బలీయమైన కోరికలతో, వ్యాపకాలతో అతి ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది. మీకూ ప్రపంచానికీ మధ్య గల ఎడం ఇంకా పెరిగి, పెద్దదై పోతుంది. అంతులేని సంఘర్షణలలో మీరు మునిగి పోతారు.

*(ది హోల్ మూవ్‌మెంట్ ఆఫ్ లైఫ్ ఈజ్ లర్నింగ్: లెటర్స్ టు స్కూల్స్; 67వ అధ్యాయం)*

ఒకసారి మీ చుట్టూ చూసుకున్నట్లయితే, ఈ మానవ ప్రపంచం వైపు కాదు – ప్రకృతి వైపు, గగనతలం వైపు చూసుకున్నట్లయితే అద్భుతమైన ఒక క్రమశీలత, ఒక సమతుల్యత, ఒక సామరస్య భావం అక్కడ కనబడతాయి. ప్రతి ఒక్క చెట్టులోను, ప్రతి ఒక్క పూవులోను దానిదే అయిన ఒక క్రమత, ఒక సౌందర్యము ఉంటాయి. ప్రతి ఒక్క కొండ శిఖరానికి, ప్రతి ఒక్క కొండ లోయకు వాటికే చెందిన ఒక లయ, అచంచలత్వము ఉంటాయి. మానవుడు నదులను తన అదుపు ఆజ్ఞల్లో ఉంచుకోవాలని ప్రయత్నిస్తున్నా, కల్మషపరచాలని ప్రయత్నిస్తున్నా ఆ నదులు తమ ప్రవాహ వేగంతో తాము ప్రవహించి పోతునే ఉంటాయి. దూరాలను అందుకోవటానికి పోయే వాటి ప్రవాహగతి వాటికి ఉంటుంది. ఇది లేనిది మనిషిలోనే. సముద్రాలలో, గాలిలో, అపారంగా విస్తరించుకున్న ఆకాశ సీమల్లో ఒక అద్భుతమైన సుస్వచ్ఛత, క్రమతలతో కూడిన అస్తిత్వం ఉన్నది.

నిజమే, నక్క కోడిపిల్లను చంపుతుంది. పెద్ద జంతువులు చిన్న జంతువులను తిని బ్రతుకుతుంటాయి. ఇది మనకు క్రూరంగా కనబడినా ఇది ఈ మహావిశ్వంలో గల క్రమతా విధానం. ఇది మనిషిలో మాత్రమే లేదు. మనిషి కనుక జోక్యం చేసుకోకపోతే విశ్వంలో గొప్ప సమతుల్యత, గొప్ప సామరస్యము ఉంటాయి. అదే ఈ మహావిశ్వపు సౌందర్యం.

*('ది హోల్ మువ్‌మెంట్ ఆఫ్ లైఫ్ ఈజ్ లర్నింగ్: లెటర్స్ టు స్కూల్' నుండి 70వ అధ్యాయం)*

మన జీవితాలను మనం వృధా చేసుకుంటున్నామా? వృధా అనే ఆ మాటకు అర్థం ఏమిటంటే మన శక్తిని అనేక రకాలుగా మనం వ్యర్థపరచుకుంటున్నాం అని. కొన్ని కొన్ని వృత్తుల్లో నిపుణులైపోయి అవే అనుసరిస్తూ మన శక్తిని వ్యర్థపరచుకుంటున్నాం అని. మన సమస్త అస్తిత్వాన్ని, మన సమస్త జీవితాన్ని ఈ విధంగా వృథాగా గడిపేస్తున్నామా? మీరు కనుక బాగా ధనవంతులయితే, 'అవును, నేను చాలా డబ్బు, సంపదలు కూడబెట్టుకున్నాను. నాకు చాలా సుఖంగా, సంతోషంగా ఉంది' అని అంటారు. లేదూ మీలో ఏదో ఒక ప్రతిభ కనుక ఉంటే ఆ ప్రతిభే మీ ఆధ్యాత్మిక జీవనానికి ప్రమాదకరం అవుతుంది. ప్రతిభ ఒక వరప్రసాదం వంటిది. అది ఒక కౌశలం. ప్రత్యేకమైన ఒక రంగంలో అభిరుచి, నేర్పు, నైపుణ్యం అంటే కూడా అదే. ఈ ప్రత్యేక నైపుణ్యాలు అన్నీ కూడా విచ్ఛిత్తిని కలిగించే అంటే మిమ్మల్ని ముక్కలు ముక్కలుగా విడదీసే ప్రక్రియలు. అందుచేత మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోవలసినది ఏమిటంటే – మీ జీవితాన్ని మీరు వృథా చేసుకుంటున్నారా? అని. మీ వద్ద చాలా ధనం ఉండవచ్చు, మీలో రకరకాలైన నైపుణ్యాలు ఉండవచ్చు, ఒక ప్రత్యేక విభాగంలో మీరు ప్రవీణులై ఉండచ్చు. గొప్ప శాస్త్రవేత్త అయియుండవచ్చు. గొప్ప వ్యాపారవేత్తలు అయియుండవచ్చు. అయితే జీవిత చరమాంకాన చూసుకుంటే అదంతా వట్టి వృథా యాతనే అని అనిపిస్తుంది కదూ?

*(బొంబాయి, 10 ఫిబ్రవరి 1985; 'దట్ బెనెడిక్షన్ ఈజ్ వేర్ యు ఆర్' నుండి)*

అసలు ఈ సమస్త జీవన అస్తిత్వానికి వెనక గల అర్థం ఏమిటి? దీని వైపు పరికించి చూడటం మీకు ఇష్టం లేక పోవచ్చు. ఎలాగోలా ఈ ప్రశ్న నుండి తప్పించుకొనిపోవాలని మీరు అనుకుంటున్నారేమో... భౌతిక శాస్త్రమో, భాషా శాస్త్రమో, జీవశాస్త్రమో, సామాజికశాస్త్రమో, తత్వశాస్త్రమో, మానసిక విశ్లేషణో, మానసిక చికిత్సా శాస్త్రమో – మొదలైన వాటిలో ఏదో ఒక విషయంలో ఉన్నత విజ్ఞానం, పాండిత్యం సంపాదించడానికి మీరు ఇరవై, ముప్పయి సంవత్సరాలు కృషి చేసి ఉండచ్చు. ఏళ్ళ తరబడి ఆ అంశాలను మీరు అధ్యయనం చేసి ఉండచ్చు. కానీ, మీరు ఏమిటో అది – ఆ దానిని మీ అంతట మీరే కనిపెట్టడానికి, మీరు ఎందుకు ఇలా జీవిస్తున్నారో అది మీ అంతట మీరే కనుగొనడానికి ఒక్క రోజు కాదు కదా చివరకు ఒక్క గంట కూడా వెచ్చించరు.

*(ఐఐటి – బొంబాయి, 7 ఫిబ్రవరి 1984; 'వై ఆర్ యు బియింగ్ ఎడ్యుకేటెడ్?' నుండి)*

---

మీ సభ్యతా సంస్కృతులు ఏమంటాయంటే – "జీవితానికి గల అర్థం ఏమిటి అని అడిగి ఎందుకు తల పగలగొట్టుకుంటారు? ఊరికే జీవిస్తూ పోండి. అసహ్యకరమైన ఈ వికృతత్వంతో, పాశవికమైన ఈ బ్రతుకుతో, ఈ దుఃఖాలతో, ఈ బాధలతో, ఆందోళనలతో, సుఖాలతో, భయాలతో, అంతూ పొంతూ లేని విసుగుదలతో, ఒంటరితనంతో బ్రతికేయండి. ఇవన్నీ మీ జీవితంలో భాగాలే. వీటిని మీరు దాటుకొని ఏనాటికీ పోలేరు. అందుచేత వీటినే ఆనందించండి. మీ జీవితంలో సుఖాలకే ప్రముఖ స్థానం ఇవ్వండి." అందుచేత మీరు అక్షరాలా ఆ పనే చేస్తున్నారు.

*(సానెన్, 22 జులై 1973)*

---

ప్రపంచంలో ఎక్కడైనా చూడండి. కొద్దిగానో ఎక్కువగానో దిగజారిపోవడం, క్షీణత మనుష్యుల్లో కనబడుతుంది. అది వ్యక్తిగతమైన సుఖం కాని, సమష్టి సుఖం కాని ఏదైనా సరే – అదే జీవితంలో అన్నింటి కంటె అతిముఖ్యమై పోయినప్పుడు – సెక్స్ సుఖం అవచ్చు, తన స్వంత ఇష్టాయిష్టాలను అందరిపై రుద్దడం అవచ్చు, తీవ్రంగా ఉద్రేకపరచే సుఖాలు అవచ్చు, స్వలాభం ఇచ్చే సౌఖ్యం అవచ్చు, అధికారమూ అంతస్తూల వల్ల కలిగే సుఖాలవచ్చు, తన సొంత సుఖసంతోషాలనే పూర్తిగా పొందాలి, తనివి తీర్చుకోవాలి, తృప్తి చెందాలి అనే ఎడతెగని కాంక్ష అవచ్చు – ఏదైనా సరే – అదే పతనానికి నిదర్శనం. బాధ్యత అనే అంశానికి పూర్తిగా అర్థం లేకుండా పోయినప్పుడు, ఇతరులను పట్టించుకోవడం అనేదే లేనప్పుడు, భూమిని గురించి గాని, సముద్ర ప్రాణులను గురించి కాని శ్రద్ధ చూపనప్పుడు – భూమ్యాకాశాలను ఈ విధంగా నిర్లక్ష్యంతో చూడటం మరొక విధమైన పతనం – దిగజారిపోవడం. ఉన్నత స్థాయిలలో కూడా కపటం ఉన్నప్పుడు, వర్తక వ్యాపారాల్లో నిజాయితీ లోపించినప్పుడు, దైనిక జీవితపు సంభాషణల్లో అబద్ధాలు ఒక భాగమైపోయినప్పుడు, కొద్ది మంది అందరి పైన నిరంకుశత్వం చలాయిస్తున్నప్పుడు, వస్తువులకే ప్రాధాన్యం ఎక్కువైనప్పుడు – అప్పుడిక సమస్త జీవితానికి ద్రోహం జరిగిపోతుంది. అప్పుడిక చంపడం జీవితపు ఏకైక భాష అయిపోతుంది. ప్రేమను ఒక సుఖంగా తీసుకుంటుంటే అప్పుడిక జీవన సౌందర్యం నుండి, జీవితపు పవిత్రత నుండి మానవులు తమను తాము తెగత్రెంపులు చేసుకున్నట్లే...

మన జీవితాల్లో సుఖానికే పెద్ద పీట వేసి ఆధిక్యతను ఇచ్చినప్పుడు, ఈ ఉద్దేశ్యం పెట్టుకొని సంబంధ బాంధవ్యాలను స్వలాభం కోసం ఉపయోగించుకుంటుంటే కనుక – అప్పుడు మరొకరితో నిజమైన సంబంధ బాంధవ్యం ఉండనే ఉండదు. అప్పుడు సంబంధ బాంధవ్యాలు వ్యాపార వస్తువులై పోతాయి. సాఫల్యం పొందాలి అనే ఆ బలమైన ప్రేరణకు సుఖసౌఖ్యాలే ఆధారం. ఆ సుఖసౌఖ్యాలు లభించకపోతే, లేదా అవి వ్యక్తం చేసుకునే మార్గం లేకపోతే – అప్పుడిక కోపము, నిరాశావాదము, ద్వేషము, కచ్చదనము పుట్టుకొస్తాయి. సుఖసౌఖ్యాల కోసం ఈ ఎడతెగని లాలస, అంతులేని ప్రయాస నిజానికి ఉన్మాదమే కదూ.

*('ది హోల్ ముమెంట్ ఆఫ్ లైఫ్ ఈజ్ లర్నింగ్ లెటర్స్ టు స్కూల్స్' నుండి; 28వ అధ్యాయం)*

---

## మంచితనం – ప్రేమ – తెలివి

**వ్యక్తిగతమైనవా? సమష్టికి చెందినవా?**

జీవితంలో అన్నింటి కంటె ముఖ్యమైన ఒకే ఒక అంశం ఏమిటంటే మంచితనంతో, ప్రేమతో, తెలివితో జరిపే చర్య ఉండాలి. మంచితనం వ్యక్తిగతమా? సమష్టిదా? ప్రేమ వ్యక్తిగతమైనదా? లేక అది వ్యక్తులకు సంబంధించనిదా? తెలివి మీదా నాదా లేక మరెవరిదోనా? ఎవరో ఒకరిదా? మీదో నాదో అని అంటే అప్పుడది తెలివి కానే కాదు. అది ప్రేమ కానే కాదు. అది మంచితనం కానే కాదు.

మంచితనం కనుక వ్యక్తికి సంబంధించిన వ్యవహారం అయితే, లేదా సమష్టికి చెందిన వ్యవహారం అయితే, మన ప్రత్యేక అభిరుచిని అనుసరించేది గాని, మన అభిప్రాయాలని అనుసరించేది గాని అయితే అప్పుడది మంచితనం కానే కాదు. మంచితనం ఒక వ్యక్తి పెరట్లోనో, లేదా సమష్టికి చెందిన ఆరు బయలు భూముల్లోనో ఉండదు. ఆ రెండింటి నుండి విముక్తమైనప్పుడు మాత్రమే మంచితనం వికసిస్తుంది.

ఈ మంచితనం, ఈ ప్రేమ, ఈ తెలివి ఉన్నప్పుడు – అప్పుడు జరిగే చర్య వ్యక్తికి సంబంధించినది గానూ ఉండదు, సమష్టికి సంబంధించినది గానూ ఉండదు.

మంచితనం లేకపోవడం వల్ల మనం ప్రపంచాన్ని వ్యక్తిగతమైనదని, సమష్టి అనీ విభజించుకున్నాం. అంతే కాకుండా ఈ సమష్టిని మళ్ళీ లెక్కలేనన్ని సంఘాలుగా సమాజాలుగా విభజించాం. మతాన్నో, జాతినో, వర్గాన్నో ప్రాతిపదికగా తీసుకొని మనుష్యులను రకరకాల సమాజాలుగా విభజిస్తాం. మనమే ఈ విభజనలు సృష్టించి, మళ్ళీ మనమే ఈ భిన్న సమూహాలను కలిపే వంతెనలు నిర్మించాలనే ఉద్దేశ్యంతో మరికొన్ని కొత్త సమాజాలను స్థాపించుకుంటాం. ఈ కొత్త సమాజాలు తక్కిన ఇటువంటి సమాజాల నుండి మళ్ళీ విడిగా వేరుపడి పోతూ ఉంటాయి. గట్టిగా చూస్తే మానవుల మధ్య సహోదరత్వాన్ని పెంచడం కోసమే గొప్ప మతాలు అన్నీ స్థాపించబడినట్లు కనబడుతుంది. నిజ వాస్తవంలో ఈ మతాలు సహోదర భావాన్ని నిరోధిస్తుంటాయి. కలుషితమైపోయిన దానిని సంస్కరించాలనే మనం ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటాం. అంతే కాని కాలుష్యాన్ని మూలంలో నుండే నిర్మూలించం. ఊరికే పైపైనగా సర్దుబాట్లు చేసుకుంటూ ఉంటాం.

*('అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్' నుండి)*

# ధ్యానము - శక్తి

ప్రతి ఒక్క ఆలోచనా కదలికకు, ప్రతి ఒక్క చర్యకు శక్తి తప్పనిసరిగా కావాలి. మీరు ఏం చేసినా, ఏది ఆలోచించినా దానికి శక్తి అవసరం. సంఘర్షణ వల్ల, అనేక రకాలైన అనవసరపు ఆలోచనల వల్ల, మనోద్వేగాలను తృప్తిపరచుకోవడం కోసం చేసే పనుల వల్ల, ప్రీతినిచ్చే భావోద్వేగ భరితమైన కార్యకలాపాల వల్ల ఈ శక్తి వృథా అయిపోతుంటుంది. సంఘర్షణ వల్ల శక్తి వ్యర్థమై పోతుంది. ఈ సంఘర్షణ ద్వైతభావం కారణంగా జనిస్తుంది. అంటే 'నేను', 'నేను - కాదు'లు అనే రెండుగా విభజించబడిన వాటి మధ్య ఈ సంఘర్షణ జరుగుతుంటుంది. పరిశీలకుడు పరిశీలితము, ఆలోచన - ఆలోచించేవాడు అనే రెండుగా విభజించబడిన వాటి మధ్య సంఘర్షణ పుడుతుంది. ఈ సంఘర్షణ శక్తిని వృథా చేస్తుంది. ఈ రకంగా శక్తి వృథా అవకుండా ఉంటే అప్పుడు శక్తి ఒక విశేష గుణాన్ని సంతరించుకుంటుంది. దీనిని ఎరుక అని అనవచ్చు. ఈ ఎరుక ఎటువంటిది అంటే దానిలో తప్పు - ఒప్పు అని తీర్పులు చేయడం కాని, విలువలు కట్టడం కాని, నిరసించడం కాని, పోల్చి చూడటం కాని ఉండవు. ఈ ఎరుకలో ఉండేది కేవలం సావధానపూరిత పరిశీలన. విషయాలను అవి ఎలా ఉన్నాయో అలా - అంతర్గతంగాను, బాహ్యంగాను కూడా అవి ఎలా ఉన్నాయో అచ్చంగా అలాగే ఉన్న వాటిని ఉన్నట్లుగా చూడటం. ఆలోచన జోక్యం లేకుండా చూడటం. ఆలోచన అంటే గతమే.

*('అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్' నుండి)*

# మీకు మీరే వెలుగు అవాలి...

చేతితో చేసిన వాటిలో కానీ, మనసుతో చేసిన వాటిలో కానీ ఏ ఆశా లేదు. ఇది తప్పించుకొని పారిపోవడం కాదు. నేను చెప్తున్నది ఏమిటంటే - కొండ శిఖరం పైన, దాని అంచు చివరన నిలబడి ఎటువంటి కార్యకలాపాలు చేసినా నేల కూలక తప్పదు - అని మీకు సూచిస్తున్నాను. ఆ కొండ శిఖరం నుండి దూరంగా ఉండటంలోనే రక్షణ, సంతోషము ఉన్నాయి. అని అంటున్నాను. ఈ గ్రహింపు ఉన్న కొద్ది మంది కాంతి దర్శనపు కేంద్రాలుగా ఏర్పడాలి. ఆ అగాధపు అంచులకు దూరంగా ఉండాలి. ప్రస్తుతం మీరు ఉన్న ఈ సంక్షోభంలో నుండి బయటపడే మార్గం ఉన్నది. అంతేకాదు మానవ సమస్యలు అన్నింటి నుండి బయటపడే మార్గం ఉన్నది. ఆ మార్గం పలాయన మార్గం కాదు. ఆ మార్గం శాశ్వతమైన నిశ్చలానందానికి దారి తీస్తుంది.

*(మద్రాసు, 22 అక్టోబరు 1947)*

*Published in August, December & April*

Periodical

*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

*If undeliveral please return to :*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64,65)
Greenways Road, Chennai - 600 028.
Tel : 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by Dr. V. Aravind on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64,65) Greenways Road, Chennai - 600 028. Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*